క్లుప్తంగా

ఘనంగా విజయదుర్గ అమ్మవారి జాతర



అంగరలోని విజయదుర్గ అమ్మవారికి పూజలు చేస్తున్న పండితుడు

కపిలేశ్వరపురం: అంగరలోని విజయదుర్గ అమ్మవారి జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉత్సవాలకు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయ పురోహితుడు కొలువుల మల్లికార్జునరావు అమ్మవారిని విశేషంగా అలంకరించారు. ఆలయం వద్ద గరగ నృత్యాలు, విచిత్ర వేషధారణలు, డప్పు వాయిద్యాలతో సంబరాన్ని ఘనంగా జరిపారు. అంగర, పడమర ఖండ్రిక గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. శనివారం ఆలయం వద్ద తీర్థం, 23న నైవేద్య సమర్పణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ప్రపంచ శాంతికి ప్రత్యేక ప్రార్థనలు

కపిలేశ్వరపురం: అంగరలోని ప్రతిష్టాత్మకమైన రేమా పెంతెకొస్తు సంఘ 20వ వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల 17న పడమర ఖండ్రికలోని హల్లెలూయ గ్రౌండ్‌లో ప్రారంభమైన సభల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రైస్తవ ప్రబోధకులు సందేశాలు ఇచ్చారు. ప్రపంచ శాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసినట్టు నిర్వాహకులు ఖండవిల్లి జ్యోత్స్నరాణి జాకబ్ జాయ్, సుందర్ జేసన్ తెలిపారు.

పారిశుధ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యం

డీపీఓ శాంతలక్ష్మి



కపిలేశ్వరపురంలోని సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శాంతలక్ష్మి

కపిలేశ్వరపురం: గ్రామ పరిపాలనలో పారిశుధ్య పరిరక్షణకు తొలి ప్రాధాన్యమివ్వాలని సంబంధిత అధికారులను జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి ఆదేశించారు. కపిలేశ్వరపురంలో పంచాయతీ నిర్వహణలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణ తీరుపై క్లాప్ మిత్రులతో చర్చించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన స్వమిత్వ సర్వే తీరును పరిశీలించారు. సర్పంచ్ శాకా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శివచక్రవర్తితో మాట్లాడారు. పలు అంశాలపై గ్రామంలోని డ్వాక్రా యానిమేటర్లు, సచివాలయ సిబ్బంది, క్లాప్ మిత్రులకు సూచనలు చేశారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

టౌన్ సీఐ దారం సురేష్



మండపేట: సమాజంలో నానాటికీ పెరిగిపోతున్న సైబర్ మోసాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ దారం సురేష్ అన్నారు. మండపేట పబ్లిక్ స్కూల్లో శుక్రవారం విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ, ప్రతి చోటా సైబర్ నేరాలు మితిమీరుతున్నాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా వ్యవహరించాలని విద్యార్థులకు సూచించారు. మహిళలు, బాలికా సంరక్షణ చట్టాలను వివరించారు. అలాగే మత్తుకు యువత బానిసలుగా మారుతున్నారని, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలను విశదీకరించారు. పిన్న వయసులోనే మంచి అలవాట్లు అలవర్చుకుని, ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. చదువుతో పాటు క్రీడల్లో రాణించి, తల్లిదండ్రులు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్కూల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ

మండపేట: ఏడిద రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఆహార పదార్థాలను రుచి చూసి, సంతృప్తి వ్యక్తం చేశారు.

ఘనంగా లక్ష పత్రి పూజ

రాయవరం: వెంటూరులో ఉన్న పార్వతీ సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ వింజమూరి సుబ్రహ్మణ్యం దంపతుల ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. మాఘమాసం శివకేశవులకు ప్రీతిపాత్రం కావడం, శుక్రవారం పురస్కరించుకుని లక్షపత్రి పూజ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

దాళ్వా గట్టెక్కేనా..!

- వరిపై విజృంభిస్తున్న తెగుళ్లు
- అందని సాగునీరు
- ఆందోళనలో రైతులు



బందనపూడిలో తెగుళ్ల నిర్మూలనకు పొలంలో మందు పిచికారీ చేస్తున్న రైతులు

కాజులూరు: ఒకవైపు సాగునీటి ఎద్దడితో సతమతమవుతున్న రైతన్నకు దాళ్వా పంటపై తెగుళ్ల బెడద మరింత ఇబ్బందులకు గురిచేస్తోంది. గోదావరిలో నీటి నిల్వలు తగ్గిపోవడంతో తూర్పు డెల్టాలోని కాలువ శివారు భూముల్లో ఉన్న రామచంద్రపురం నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో వరి పొలాలకు సాగునీటి ఎద్దడి తలెత్తింది. ప్రస్తుత దాళ్వాలో కాజులూరు మండలంలో 18,700 ఎకరాల్లోను, రామచంద్రపురం మండలంలో 16,500 ఎకరాల్లోను, కె.గంగవరం మండలంలో 15 వేల ఎకరాల్లోను వరిసాగు చేపట్టారు. ప్రతికూల పరిస్థితును అధిగమిస్తూ, రైతులు సాగు చేస్తుండగా.. ఊహించని తెగుళ్ల పంటలపై దాడి చేస్తున్నాయి. సాధారణంగా ఫిబ్రవరి నెలాఖరు నాటికి పంట చిరుపొట్ట దశ నుంచి ఈనిక దశకు చేరుకునేది. దీంతో ఎండలు ముదిరినా పెద్దగా ప్రభావం ఉండేది కాదని రైతులు అంటున్నారు. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది.

ఒక్కోచోట.. ఒక్కోలా..

గత తొలకరి చివరి దశలో తుపాన్లు సంభవించి, భారీ వర్షాలు కురవటంతో మాసూళ్ల నిర్వహణకు తీవ్ర అవరోధాలు ఎదురయ్యాయి. నూర్పుళ్లు ముగించి, పంట దమ్ములు పూర్తి చేసుకుని, నారుమడులు వేసుకున్న తర్వాత మరలా వర్షాలు కురవటంతో కొందరు రైతులు రెండుసార్లు నారుమడులు చల్లుకోవాల్సి వచ్చింది. ఫలితంగా నిర్దేశిత వ్యవధిలో కాకుండా, ముందు, వెనుకా రైతులు రబీ సాగు చేపట్టారు. దీంతో ప్రస్తుతం వరి పంట ఒక్కొక్కచోట.. ఒక్కో దశలో ఉంది. ముందుగా నాట్లు వేసిన చోట వరిపంట చిరుపొట్ట దశలో ఉండగా, ఎక్కువ విస్తీర్ణంలో ఆలస్యంగా నాట్లు పడిన పొలాల్లో దుబ్బుకట్టే దశలో ఉంది.

తెగుళ్ల దాడి

రాత్రి పూట మంచు కురుస్తుండటం, పగటి పూట అధిక ఉష్ణోగ్రతలతో పలు రకాల తెగుళ్లు రబీపై దాడి చేస్తున్నాయి. ఆలస్యంగా నాట్లు పడిన పొలాల్లో ఈ బెడద అధికంగా ఉందని రైతులు చెబుతున్నారు. ప్రధానంగా దుబ్బుకుళ్లు తెగులుతో పాటు, జింక్‌లోపం, మొవ్వ పురుగు, ఉల్లికోడు, మాగుడు తెగుళ్ల ప్రభావం కనపడుతోంది. కాలువ నీరు సక్రమంగా రాకున్నా, వ్యయప్రయాసలతో డ్రెయిన్లలోను, పంట కాలువల్లోను నీటిని ఆయిలింజన్లతో, గుల్లతో తోడుతూ సాగు చేస్తుంటే, తెగుళ్లు పంటకు నష్టం కలుగజేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తీవ్ర వ్యయప్రయాసలకోర్చి రబీ సాగు చేస్తున్న తరుణంలో ప్రస్తుత పరిస్థితి దిగుబడులను దెబ్బతీస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట తెగుళ్ల ఉధృతిపై కాజులూరు మండల వ్యవసాయాధికారి వి.అశోక్‌ను సంప్రదించగా, ప్రస్తుత వాతావరణం పరిస్థితుల కారణంగా పంటలపై పలు రకాల తెగుళ్లు ఆశించేందుకు అవకాశం ఉందన్నారు. పంటలపై తెగుళ్ల లక్షణాలు కనిపించిన వెంటనే రైతులు స్థానిక రైతు సేవా కేంద్రం లోని సిబ్బందిని లేదా మండల వ్యవసాయ కేంద్రంలో కానీ సంప్రదించాలన్నారు.



గొల్లపాలెంలో జింకుధాతు లోపానికి గురైన వరి పొలం

భయాందోళనకు గురవుతున్నాం



పంట చిరుపొట్ట దశకు చేరుకోవటంతో తెగుళ్ల బెడద కారణంగా భయాందోళనకు గురవుతున్నాం. కొన్ని రకాల తెగుళ్లు గుర్తించేలోపే పొలం అంతా వ్యాపిస్తున్నాయి. ఎన్ని రకాల మందులు వాడినా అదుపులోకి రావటం లేదు. పురుగు మందుల ధరలు పెరగటంతో తెగుళ్లను అధిగమించటం కష్టతరంగా మారింది.

– కర్రి రామారెడ్డి, రైతు, గొల్లపాలెం

దిగుబడిపై ప్రభావం



వరి పంట చిరుపొట్ట దశలో తెగుళ్ల బారిన పడితే దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఈనిక దశలోనే గింజలు గట్టిపడకపోతే తాలు, తప్పలుగా మారిపోతాయి. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టాం. తెగుళ్లను నివారించేందుకు వ్యవసాయాధికారులు సహకరించాలి.

– సువ్వారి గోవిందు, రైతు, తర్లంపూడి

కేంద్ర స్కాలర్‌షిప్‌కు ద్వారపూడి విద్యార్థిని ఎంపిక



హాసిని

మండపేట: ద్వారపూడి జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థిని మొగలి హాసిని కేంద్ర ప్రభుత్వ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్)కు ఎంపికైంది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పరీక్షల్లో విజయం సాధించిన ఆమెను పలువురు అభినందించారు. ఏడాదికి రూ.12 వేల చొప్పున ఇంటర్మీడియెట్ పూర్తయ్యే వరకూ ఆమెకు స్కాలర్‌షిప్ అందుతుంది.

పలు గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని ఆధార్ వివరాలను నవీకరించేందుకు, నూతన ఆధార్ నమోదు కోసం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రత్యేక నవీకరణ కేంద్రాలను నిర్వహించారు. ఎంపీడీఓ కె.రత్నకుమారి పర్యవేక్షణలో అంగర, కాలేరు, కోరుమిల్లి గ్రామాల సచివాలయాల పరిధిలోని చిన్నారుల ఆధార్ వివరాలను నవీకరించారు. ఆయా శిబిరాల్లో డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, కోరా దొరబాబు, ఫణీంద్ర ఆధార్ నవీకరణ సేవలందించారు. శనివారం తాతపూడి, వెదురుమూడి, కోరుమిల్లి గ్రామాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

డ్రైన్‌లోకి సెప్టిక్ ట్యాంక్ కనెక్షన్

దుర్గంధంతో స్థానికులకు ఇబ్బందులు

మండపేట: ఓ వైపు పట్టణంలో మెరుగైన పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత వంటి కార్యక్రమాలతో మున్సిపల్ అధికారులు అవగాహన కల్పిస్తుంటే ప్రజలకు ఏమాత్రం పట్టడం లేదు. డ్వాక్రా మహిళలు, శానిటేషన్, సచివాలయ సిబ్బంది వార్డుల్లో పర్యటించి అవగాహన పెంపొందిస్తున్నా, ఇవేమీ పట్టించుకోకుండా కొందరు ఎవరి పని వారిదే అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. డ్రైన్లలో చెత్త వేయడం, ఇళ్ల నుంచి లెట్రిన్ కనెక్షన్లను డ్రైన్లలోకి పెట్టడం వంటి పనులు మానడం లేదు. దీనివల్ల వారితో పాటు, చుట్టుపక్కల వారూ రోగాల బారిన పడతారన్న ఆలోచన కూడా లేకుండా వ్యవహర్తిస్తున్నారు. ఇలాగే 11వ వార్డు న్యూ కాలనీలోని ప్రకాశం మున్సిపల్ స్కూల్ సమీపంలో ఉన్న ఓ ఇంటి నుంచి సెప్టిక్ ట్యాంకు కనెక్షన్ నేరుగా డ్రైన్‌కు కలిపారు. దీంతో ఆ వీధిలో ఉన్న ఇతర నివాసితులు దుర్గంధం భరించలేకపోతున్నారు. దీనిపై వారు సచివాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అలాగే ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు దృష్టికి కూడా ఈ సమస్య వివరించారు. మురుగు దొడ్డి నుంచి వచ్చే మురుగు నీరు డ్రైన్ ద్వారా తమ ఇళ్ల మీదుగా పారడంతో విపరీతమైన దుర్వాసన వస్తోందని, ఇళ్లలో భోజనాలు కూడా చేయలేకపోతున్నామని వాపోయారు. డిసెంబర్ 26న ఈ సమస్యపై ఫిర్యాదు చేస్తే, నేటికీ సచివాలయ సిబ్బంది కానీ, మున్సిపల్ అధికారులు కానీ పట్టించుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విజయవంతంగా విజ్ఞాన శాస్త్ర వారోత్సవాలు

జిల్లా సైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం



జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీ పరీక్షను పరిశీలిస్తున్న సుబ్రహ్మణ్యం తదితరులు

కె.గంగవరం: ఏపీ ఫిజికల్ సైన్స్ ఫోరం, జిల్లా సైన్స్ విభాగం సంయుక్తంగా నిర్వహించిన మండల స్థాయి సైన్స్ వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయని జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో జరుగుతున్న జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ పోటీ పరీక్షలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా ఉన్న 239 ఉన్నత పాఠశాలల నుంచి ప్రతి పాఠశాలలో ఇద్దరు చొప్పున మొత్తం 478 మంది 9వ తరగతి విద్యార్థులు ఈ పరీక్షల్లో పాల్గొన్నారన్నారు. వీరితో పాటు 239 ఉన్నత పాఠశాలలు, 60 ప్రాథమికోన్నత పాఠశాలల నుంచి మొత్తం 576 మంది 8వ తరగతి విద్యార్థులు పరీక్షల్లో పాల్గొన్నారని వివరించారు. ఈ పరీక్షల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 25వ తేదీన అమలాపురంలో జిల్లా స్థాయి పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 28న జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని జరగనున్న సైన్స్ సంబరాల్లో విజేతలకు జిల్లా విద్యాశాఖాధికారి బహుమతులు ప్రదానం చేస్తారని తెలిపారు. తొలుత జిల్లా స్థాయి సైన్స్ క్విజ్ ప్రశ్నాపత్రాన్ని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ చోడిశెట్టి ఆంజనేయులు, అప్కాస్ట్ సమన్వయకర్త పీవీ బ్రహ్మానందం, హెచ్ఎం పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు తప్పనిసరి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి బోసుబాబు



దంగేరులో నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న బోసుబాబు

కె.గంగవరం: రైతులందరూ తప్పనిసరిగా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వి.బోసుబాబు అన్నారు. మండలంలోని దంగేరు, కోటిపల్లి గ్రామాల్లో ఉన్న ఆర్‌బీకేలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయా ఆర్‌బీకేల్లో జరుగుతున్న రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ఉంటేనే రానున్న కాలంలో ప్రభుత్వం నుంచి పథకం, రాయితీలు, సబ్సిడీలు అందుతాయన్నారు. ఈ సమోదు ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతి ఒక్క రైతు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ సిబ్బందిని ఆదేశించారు. ఈ నెల 23వ తేదీలోపు రైతులందరూ ఈ సంఖ్యను పొందాలని, వారంతా 24వ తేదీన కేంద్ర ప్రభుత్వం వేసే 19వ విడత పీఎం కిసాన్ సొమ్ముకు అర్హులవుతారని తెలిపారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు సబ్సిడీపై డ్రోన్లు ఇచ్చి, శిక్షణ కూడా ఇస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్నవారు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రం వద్ద సంప్రదించాలని కోరారు. ఆయన వెంట ఏఓ బలుసు రవి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

రైతు సేవా కేంద్రం సందర్శన

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెం రైతు సేవా కేంద్రాన్ని బోసుబాబు శుక్రవారం సందర్శించారు. ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో మండల ప్రగతిని సమీక్షించారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఈ నెల 25లోగా రైతు విశిష్ట నమోదు సంఖ్యను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట రామచంద్రపురం ఏడీఏ ఏవీఎస్ రంగారావు, ఎంఏఓ ఎస్.సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



కె.గంగవరంలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న డీఎస్పీ

కె.గంగవరం: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు మండల కేంద్రమైన కె.గంగవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను శుక్రవారం రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ పరిశీలించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ బూత్ వద్ద అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. అర్హత పొందిన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఆయన వెంట సీఐ వెంకటనారాయణ, ఎస్సై జానీబాషా ఉన్నారు.

రామచంద్రపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ రఘువీర్ శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం, పాత తహసీల్దార్ కార్యాలయం, కృత్తివెంటి పేర్రాజు పంతులు పాఠశాల, మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటు చేసే పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట సీఐ వెంకటనారాయణ, ఎస్సై నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

పరిశుభ్ర పట్టణంగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్ కమిషనర్ రంగారావు



వార్డుల్లో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న కమిషనర్

మండపేట: పట్టణాన్ని పరిశుభ్రతలో అన్ని విధాలుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. శుక్రవారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. వార్డు సచివాలయ సెక్రటరీలతో వార్డు కమిటీలు ఏర్పాటు చేశారు. స్వచ్ఛ మండపేట సాధనే లక్ష్యంగా తాము పని చేస్తున్నామన్నారు. శ్రీనగర్, తరవాణీపేట, సత్యశ్రీ రోడ్డు, మెయిన్ రోడ్లలో పర్యటించారు. మెయిన్ రోడ్డులో హోటళ్లను తనిఖీ చేశారు. చిన్న కార్ల స్టాండు వద్ద అపరిశుభ్రంగా ఉన్న టీ స్టాల్‌కు జరిమానా విధించారు. ఆయన వెంట డీఈ కె.శ్రీనివాస్, ఏఈ పవన్ కుమార్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, వార్డు సెక్రటరీలు ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

మండపేట: విద్యార్థి దశ నుంచి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలని రామచంద్రపురం డివిజన్ ఉప విద్యా శాఖాధికారి పి.రామలక్ష్మణమూర్తి అన్నారు. ఏపీ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యంలో స్థానిక ఎస్‌వీఎస్సార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం సైన్స్ క్విజ్ పోటీలు నిర్వహించారు. గౌతమి మున్సిపల్ హైస్కూల్ విద్యార్థినులు వై.ప్రణీత, యూవీఎస్ఎస్ ప్రజ్ఞ ప్రథమ స్థానంలో నిలిచి, జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. కార్యక్రమానికి ఇన్‌చార్జి హెచ్ఎం జీవీ గణేష్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులు రామలక్ష్మణమూర్తి, ఎంఈఓ చింతా వెంకటసోమిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఎస్ టీచర్స్ ఫోరం జిల్లా ప్రతినిధులు గండి స్వామిప్రసాద్, జి.శ్రీనివాస్, ఎస్‌సీ రామానుజం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



కాజులూరులో యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మోహన్‌కుమార్

కాజులూరు: కళాశాలలు, పాఠశాలల వద్ద అమ్మాయిలతో ఆకతాయిలు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లపాలెం ఎస్సై ఎం.మోహన్‌కుమార్ హెచ్చరించారు. కాజులూరులో కళాశాలలు, పాఠశాలల వద్ద అమ్మాయిలు వచ్చి, వెళ్లే సమయాల్లో తారసపడిన 13 మంది యువకులను ఎస్సై మోహన్‌కుమార్, సిబ్బందితో నిలువరించారు. వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గ్రామాల్లో కళాశాలలు, పాఠశాలల వద్ద ఈవ్ టీజింగ్‌కు పాల్పడే ఆకతాయిలపై గట్టి నిఘా ఉంచామన్నారు. విద్యార్థినులు, మహిళలకు ఆకతాయిల నుంచి ఇబ్బందులు ఏర్పడితే 94407 96559 నంబరుకు లేదా 112 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మూర్తి

రామచంద్రపురం రూరల్: టెన్త్ విద్యార్థులకు కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంఘ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రాజమండ్రి కార్పొరేషన్ విశ్రాంత వైద్యాధికారి డాక్టర్ ఎంవీఆర్ మూర్తి మాట్లాడుతూ, పరీక్షల సమయంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి బళ్లా శ్రీనివాసరావు, పి.దేవానందం, మట్టా వీరబాబు మాట్లాడుతూ, విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలన్నారు. నిద్ర మానుకుని చదివితే మానసిక ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉందన్నారు. హెచ్ఎం వాడ్రేవు రత్నపద్మావతి, ఎస్ఎంసీ చైర్‌పర్సన్ కె.నాగజ్యోతి, వైస్ చైర్మన్ పి.మాణిక్యాంబ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సొంత భాషలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలి



డాక్టర్ మురళీకృష్ణను సత్కరిస్తున్న అధ్యాపకులు

రామచంద్రపురం: మాతృ భాషలో ప్రావీణ్యం పెంపొందించుకోవాలని ప్రముఖ వైద్యులు యనమదల మురళీకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ, ఆధునిక సాహిత్యాన్ని అధ్యయనం చేయడం వల్ల ఆసక్తిగా మాట్లాడే సామర్థ్యం వస్తుందన్నారు. ఆధునిక సాహిత్యాన్ని చదవడాన్ని విద్యార్థులు జీవితంలో భాగంగా చేసుకోవాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ లక్ష్మి సభకు అధ్యక్షత వహించారు. అధ్యాపకులు డాక్టర్ సుజాత, డాక్టర్ ఎస్ వెంకటరమణ, బేగం, ప్రభాకర్, చలం తదితరులు పాల్గొన్నారు. అనంతరం సత్య వర్ధన్ కళారూపాల, తెలుగు ఆర్ట్ ఎగ్జిబిషన్లను డాక్టర్ మురళీకృష్ణ ప్రారంభించారు. ఆయనను అధ్యాపకులు సత్కరించి, సత్యవర్ధన్ వేసిన ఆయన చిత్రపటాన్ని బహూకరించారు.

జాబ్‌మేళాకు 32 మంది హాజరు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దివీస్ లేబొరేటరీ లిమిటెడ్ బల్క్ డ్రగ్ కంపెనీ శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 32 మంది హాజరయ్యారు. ఫార్మసీ, కెమిస్ట్రీ అభ్యర్థులకు రాత పరీక్ష, మౌఖిక పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన అభ్యర్థులకు వారం రోజుల్లో నియామక పత్రాలు పంపిస్తామని హెచ్‌ఆర్ పూర్ణప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో హోంగార్డుకు గాయాలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదకు చెందిన పిల్లి వీరబాబు రామచంద్రపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో హోం గార్డుగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆయన డ్యూటీ కోసం రామచంద్రపురం బయలుదేరారు. తాళ్లపొలం నవరత్నాలగరువు సెంటర్‌కు వెళ్లేసరికి ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని ద్విచక్ర వాహనం అతని మోటార్ బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో వీరబాబు కాలికి బలమైన గాయం కావడంతో, స్థానికుల సహకారంతో ఆయనను రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి కాకినాడ ప్రైవేటు ఆస్పత్రికి పంపించారు. ఆస్పత్రి సమాచారం మేరకు ద్రాక్షారామ అడిషనల్ ఎస్సై భుజంగరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసుల్లో జైలు

మండపేట: చోరీ కేసుల్లో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధించినట్టు ఎస్సై హరికోటి శాస్త్రి శుక్రవారం తెలిపారు. స్థానిక రథంవీధికి చెందిన పూర్ణచంద్ర నాగరాజుపై గతేడాది రెండు బైక్ చోరీ కేసులు నమోదయ్యాయి. నేరం రుజువు కావడంతో ఆలమూరు జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ నాగేశ్వరనాయక్ నిందితుడికి శిక్ష విధించారు.